# ఆధ్యాత్మిక వాదమునకు ఆత్మయే ఆధారము

srisathyasaivachanamrutam

**పలుమతములవారిచటికి**
**నలుమూలలనుండి వచ్చి యభయముతో**
**కలిమిలేమియు తలపక**
**పలు బాధల కోర్చియుంద్రు బాబాకొరకై**
**నాస్తికభావము నల్గడ నిస్తులమైయుండి**
**విషయములందున్ ఆస్తికభావము నెలకొల్పి**
**నిస్తులమైయుండె సాయి నిశ్చలప్రేమన్**

ప్రేమస్వరూపులారా!

మానవులందరు దేహనిర్మాణములో యెట్టి భేదము లేకపోయినప్పటికిని సంస్కారమునందును. భావమునందును, తలంపులందును అనేక భేదములు కనుపించుచున్నవి. మానవ సమూహమే దేశము. పై సత్యమే దేహమునకుకూడను అన్వయిస్తుంది. భూగోళమందలి వాతావరణమునందు యెట్టి భేదములు లేకపోయినప్పటికిని, దేశప్రజల జీవన విధానమునందు అనేక భేదములు మనకు కనుపించుచున్నవి. ఇట్టి భిన్నత్వమే మానవత్వమునకు గుర్తు. సత్యము ఒక్కటే! ఇది అవాఙ్మానసగోచరమైనది. త్రికాలాభాధ్యమైనది. ఈ సత్య పదార్థమును గుర్తించే నిమిత్తమై యనేకమంది జిజ్ఞాసులు యనేక విధమైన మార్గములందు ప్రయత్నములు సలుపుతూ వచ్చారు. జిజ్ఞాసులైన మానవులయందు అనేక విధములైన భేదములు కనుపించుచున్నవి. ఈ భేదములు ప్రకృతికి ఒక వికారము కానేరవు. ఈ భేదములన్నియు ప్రకృతియొక్క వైవిధ్యమునకు నిదర్శనములే! ఇట్టి భేదమనేది మానవునియందు వుండటంచేతనే ఐకమత్యమునకు, ఏకత్వమునకు అనేక ప్రయత్నములు సలుపుతూ వస్తున్నారు.

**ఏకత్వమును భిన్నత్వముగా భావించి, అనేకత్వాన్ని పెంచి, దివ్యత్వాన్ని విస్మరించటం సరైన పద్ధతి కాదు**

బ్రాహ్మణాం అనేకత్వం. బ్రాహ్మణులనగా ఒక వర్ణమునందుగానీ లేక ఆచార, వ్యవహారముతో వుండినవారుగాని కాదు. సత్యపదార్థమునందు సరైన రీతిలో జిజ్ఞాస సల్పి, సత్యాన్ని గుర్తింపజేయువారు బ్రాహ్మణలని దీని అంతరార్థము. ఏదేశమువారైనను కావచ్చును. ఏ కాలము వారైనను కావచ్చును. సత్‌జిజ్ఞాసను సల్పువారు బ్రాహ్మణులని గుర్తించాలి. ఏకత్వమును భిన్నత్వముగా భావించి, అనేకత్వాన్ని పెంచి, దివ్యత్వాన్ని విస్మరించటం యిది సరైన మార్గము కాదనికూడను ఖండించింది, శృతి. దీనినే 'యేకం సత్ విప్రాః బహుధా వదంతి' అని పేర్కొనడం జరిగింది. ఒక్క సత్యమునే అనేకమంది అనేక విధములుగా ప్రబోధిస్తూవచ్చారు. ఇట్టి జిజ్ఞాసనుండి వెలువడినవే ప్రాచీనమైన షట్‌దర్శనములు.

ఇట్టి పవిత్రమైన వైదిక సాంప్రదాయమును యీనాడు దర్శించటంగానీ లేక విచారించుటగానీ జరుగుట లేదు. ఈ షట్‌దర్శనములయొక్క మార్గములు భిన్నముగా వుండినప్పటికి గమ్యము ఒక్కటే అనే సత్యమునుకూడను ప్రబోధిస్తూ వచ్చింది. యీనాడు దేశము భిన్నత్వముతోకూడి భౌతిక వాదముతో వుండటంచేత యిలాంటి షట్‌దర్శనములయొక్క సాధనలకు అవకాశము లభించటంలేదు. భౌతికవాదము ప్రపంచములో వ్యాపించటంచేత యీ షట్‌దర్శనములయొక్క ప్రభావము గుర్తించటానికి తగిన వాతావరణముకూడను లేకపోతున్నది.

భౌతిక వాదమనగా పంచేంద్రియములనే ప్రధానముగా లక్ష్యమునందుంచుకొని, వాటి కలయికచేతనే చైతన్యము యేర్పడుచున్నదని భావించటం. యిలాంటి పరిణామతత్వమును ఆశించేవారు భౌతికవాదులని సిద్ధాంతము. భౌతికవాదమనేది జడస్వరూపము. ఇది పరిమితమైన శక్తితోకూడినది. పరిమితశక్తితోకూడిన పంచేంద్రియములనుండి చైతన్యము ఆవిర్భవించటమనేది అవైదికము అనగా వైదిక సిద్ధాంతములకు వ్యతిరేకము. కనుకనే ఈ భౌతికవాదమును ఖండించుచూ యిది సత్యమైనదికాదని, జడమైన

sri sathyasai vachanamrutam

పరిమితముతోకూడినదని విమర్శించుచూ ఆధ్యాత్మికవాదము ప్రారంభమవుతూ వచ్చింది.

**చైతన్యమే జడమును కదలింపజేయుచున్నదిగాని, జడము చైతన్యమును ఆవిర్భవింపజేయటం లేదు**

ఆధ్యాత్మికవాదమునకు ఆత్మయే ఆధారము. ఇది పరిమితి లేనిది. ఇలాంటి అపరిమితమైన ఆత్మతత్వాన్ని ప్రబోధించే వేదము, పరిమితమైన భౌతికవాదము కేవలము జడస్వరూపాన్ని మాత్రమే నిరూపించేదని తీర్మానించింది. అనగా మూలచైతన్యమునందు మూడు విధములైన చైతన్యము ఒక భాగము జడముతో కూడినదని శృతి నిరూపిస్తూవచ్చింది. కనుకనే చైతన్యము జడమును కదలింపజేయుచున్నదిగాని జడము చైతన్యమును ఆవిర్భవింపజేయటంలేదనే సత్యమునుకూడా ఆధ్యాత్మికవాదము నిరూపిస్తూవచ్చింది. 'ఊర్ధ్వమూలమ్ అధఃశాఖ' అని భగవద్గీతలో చెప్పినట్లుగా కొమ్మలు క్రింద వేర్లుపైన అనే వాదమునకుకూడను యిదే ప్రమాణము. చైతన్యమే జడమును కదలింప జేయుచున్నదిగాని, ఉద్భవింపజేయుచున్నదిగాని జడము చైతన్యమును ఆవిర్భవింపచేయటంలేదు. జగత్తులో మహత్తరమైన అనేక యంత్రములు వుంటున్నవి. ఈ యంత్రములనుండి అనేక విధములైన శక్తిని ఆవిర్భవింపజేస్తున్నది. ఈ యంత్రములవల్లనే భూమండలము సూర్యునిచుట్టూ ప్రదక్షిణము చేయటం సంభవిస్తూవచ్చింది. అయితే, యీ యంత్రములు జడరూపమైనవి. ఇవి స్వతస్సిద్ధముగా యీ విధమైన ఫలితములు అందించుచున్నవా అని ప్రశ్నించినప్పుడు యివి యే మాత్రముకూడను స్వతసిద్ధమైనవి కావని నిరూపణ జరిగింది. అట్టి శక్తివంతమైన యంత్రములు నిర్మించినవాడు మానవుడే! వాటిని నడిపించినవాడూ మానవుడే! మానవుడు చైతన్యస్వరూపుడు. కనుక, జడమైన యంత్రములను కదలింపజేయటానికి ప్రయత్నము చేయుచున్నాడు. అంతేగాని, జడమునుండి చైతన్యము ఆవిర్భవించటం సత్యము కాదని మనకు స్పష్టము అగుచున్నది.

**మానవుని సంకల్పములే అతని బంధనలకు మూలకారణము**

అన్నింటికి మానవుడే ప్రమాణము, మానవుడే ఆధారము, మానవుడే గమ్యము అనే సత్యాన్నికూడను మనము గుర్తించటానికి వీలవుతుంది. పశువువలె ప్రకృతికి వశమై,

sri sathyasai vahini / vachanamrutam

ప్రకృతిచేత బంధితుడైయుండటం మానవత్వముయొక్క లక్షణముకాదు. నరత్వమునుండి నారాయణత్వము పొంది ప్రకృతికి వశుడు కాక ప్రకృతిని పరిపాలించే అధిపతిగా తాను తయారయ్యే అధికారము అతనికున్నది. బుద్ధిమంతుడైన మానవుడు, సంసారమునకు బద్ధుడై నేను అన్ని విధములైన కష్టములకు లోబడినానని యేడ్చుటము మానవుని కర్తవ్యముకాదు. సంసారము నిన్ను బంధించినదని విలపిస్తున్నావు. సంసారమునకు చేతులుగాని, కన్నులుగానీ, కాళ్ళుగాని, నోరుగాని లేదు, నిన్ను కబళించటానికి. నీ సంకల్పములే నీ బంధనలకు మూలకారణము కానీ సంసారముకాదనే సత్యాన్నికూడను స్పష్టము చేయుచున్నది. ఇలాంటి బాహ్యమైన చింతలకు లోబడి నిత్యసత్యమైన దివ్యత్వాన్ని మనము విస్మరిస్తూ వస్తున్నాము.

**'సర్వం విష్ణుమయం జగత్'**

సమస్తము ఆత్మనుండియే ఆవిర్భవిస్తున్నది. లోకములో ప్రతి పదార్థముకూడను పుట్టుటకు పూర్వము లేదు. ఈ పదార్థము నశించిన తరువాతకూడను లేదు. మధ్యకాలములో కనుపించేటివన్నియు భ్రమస్వరూపమే గాని బ్రహ్మస్వరూపముకాదు. సముద్రపు ఒడ్డున ముత్యపు చిప్పను చూచి వెండి బిళ్లని భావిస్తుంటాము. వెండి బిళ్లని భావించినప్పుడుకూడను అది ముత్యపు చిప్పనే! దీనికి పూర్వము, అది ముత్యపు చిప్పనే! కేవలము నీ భ్రాంతి మాత్రమే దానిని వెండి బిళ్లగా భావించిందేగాని నిజంగా అది వెండి బిళ్లకాదు. అదే విధముగనే మనము యీనాడు జగత్తులో అనుభవిస్తున్న సమస్త సౌఖ్యములుకూడను కేవలము మన అపోహలేగాని, ఆత్మస్వరూపముకాదు. నిత్యసత్యమైన బ్రహ్మతత్త్వమే యీ జగత్ స్వరూపముగా మనకు నిరూపిస్తూవస్తోందికాని నిజానికి జగత్ వేరు, బ్రహ్మ వేరు కావేరదు. 'సర్వం విష్ణుమయం జగత్' అనగా సర్వము దైవత్వమనే సత్యాన్ని గుర్తించినప్పుడు ప్రతి భాగముకూడను బ్రహ్మనే! ప్రతి వృక్షము కల్పవృక్షమే! కర్మక్షేత్రముకూడను పుణ్యక్షేత్రమే! ఇట్టి యేకత్వమైన దివ్యత్వాన్ని మనము గుర్తించాలి. మనము చేసే సమస్త సాధనలుకూడను దైవమును తెలుసుకొనుటకైకాదు. ఈ సాధనలవల్ల దైవత్వాన్ని నీవు గుర్తించలేవు. ఇవన్నీ నీ అల్పతృప్తి నిమిత్తమై నీవు ఆచరించే సాధనలే కాని

srisathyasaivachanamrutam

ఆత్మనిమిత్తమై ఆచరించేవి కాదనే సత్యాన్ని గుర్తించాలి. నీవు చేసే భజనలుగాని, నీవు చేసే ధ్యానములుగాని, నీవు సలిపే జపములుగాని దైవము నిమిత్తము కాదు. నీ నిమిత్తమై నీవు ఆచరిస్తున్నావు. నీ తృప్తి నిమిత్తమై నీవు ఆచరిస్తున్నావు.

**నీ రాగద్వేషములే దైవానికి నిన్ను దూరము గావించుచున్నవి**

భగవంతుడు ఆశించేది ఒక్కటి లేదు. భగవంతునికి ఆశలే లేవు. భగవంతుడు నీ కంటే వేరుగా లేడు. అట్టి అజ్ఞానమునకు ఆలవాలమైన రాగద్వేషములను నీవు విస్మరించుకున్న నీకు నీవే సాక్షిగా రూపొందుతావు. నీ రాగద్వేషములే దైవానికి నిన్ను దూరము గావించుచున్నవి. నీ రాగద్వేషములను నీవు నిర్మూలము గావించుకున్న నీవే దైవత్వముగా రూపొందుతావు. అంతేకాని దైవత్వముకొరకై అనేక సాధనలు సలిపి నిత్యసత్యమైన బ్రహ్మతత్త్వాన్ని పొందాలనేది కేవలము భ్రమ మాత్రమే. మనము జగత్తులో అనేక విధములైన సాధనలు ఆచరిస్తున్నాము. యమ, నియమ, ప్రాణాయామ. ప్రత్యాహార మొదలగు సాధనలంతా చేస్తున్నాము. శ్రవణ, మనన, నిధిధ్యాసలుకూడను ఆచరిస్తున్నాము. అయితే, యివన్నికూడను దేని నిమిత్తమై యేర్పడినవి? అని మనము విచారించినప్పుడు యివి దైవదర్శన నిమిత్తముకదా యని మనము విశ్వసించవచ్చును. కాదు, కాదు. సాధన చతుష్టయములుగాని, యమనియమాది సాధనలుగాని యివన్ని మనస్సును కప్పి వుంచే రాగద్వేషములను నిర్మూలముగావించేవి. మానవత్వానికి పట్టిన మాలిన్యమును తొలగించే నిమిత్తము. చిత్తశుద్ధి యేర్పడిన తక్షణమే మానవుడు తనయొక్క స్వరూపాన్ని తాను గుర్తించుకోగలడు. ఎంతకాలము అహంకారమమకారములు యీ చిత్తమును కప్పివుండునో అంతవరకు దైవత్వాన్ని యేమాత్రముకూడను గుర్తించుకోలేడు.

కనుకనే అట్టి దైవత్వముయొక్క యేకత్వాన్ని గుర్తించే నిమిత్తమై యీ సాధనలు యేర్పడినవనే సత్యాన్ని మనము గుర్తించాలి. మానవులందరు యేకోన్ముఖులైపోయి దివ్యమైన ఆత్మతత్త్వాన్ని దర్శించటానికి ప్రయత్నించాలి. మానవత్వములో ఆదర్శవంతమైన ఐకమత్యమును మనము సాధించాలి. ఈ విధమైన ఐకమత్యమును మనము సాధించినప్పుడే దివ్యత్వమనే ఆత్మతత్త్వము మనకు ప్రకాశిస్తుంది. మనము



sri sathyasai vachanamrutam

ఆత్మస్వరూపులుగానే వున్నాము. ఆనందస్వరూపులుగానే వున్నాము. అమృతబిందువులుగానే వున్నాము. అమరస్వరూపులుగానే వున్నాము. కానీ దానిని గుర్తించలేకుండా చేసే నిమిత్తమై రాగద్వేషములు మనను ఆవరించినవి. ఆత్మతత్వాన్ని కప్పిన యీ అజ్ఞానమును మనము దూరము గావించుకోవాలి.

**సత్యస్వరూపమును తెలుసుకోవటానికి ప్రయత్నించాలి**

మనము చేసే తప్పొప్పులను క్షమించుమని పరమాత్మను కోరుకోటం సహజంగా జరుగుతూ వస్తున్నది. ఇదే పద్ధతి క్రిష్టియన్సులోపల అనాదికాలమునుండి వస్తుంది. భక్తులు తప్పులు చేయటము, భగవంతుని తమ తప్పులు క్షమించమని ప్రార్థించటము, భగవంతుడు క్షమించినట్టుగా అనుగ్రహించటము యివన్నీకూడను మానవ సహజమైన భ్రమయందు మాత్రమే ఉంటాయి. చర్చిలలోపలకూడను అనేకమంది తాము చేసిన తప్పులు క్షమించుడని ప్రార్థించినప్పుడు ఆ పోప్ లేక ప్రీస్టు 'నిన్ను నేను క్షమించాన'ని వారికి చెప్పటము, దానితో వారు తృప్తిపడి యీ క్షమాపణకు యింత ధనమని చెల్లించటము జరుగుతూ వస్తున్నాది. Repentence అనగా యేమి? 'నా తప్పులు క్షమించుము. నేను తప్పులు చేశాను', అని అంగీకరించి క్షమాభిక్షను పొందే దానికి Repentence అంటారు. ఇలాంటి పద్ధతిని ప్రాచీనకాలమునుండి భారతదేశమునందు మనము అనుసరిస్తూవస్తున్నాము. ఏదో కొన్ని మొక్కులు మ్రొక్కడం, వాటిని చెల్లించిన తరువాత మన కష్టములు నివారణ కావటము అనేది కేవలము అల్పభావముతోకూడిన భ్రాంతులు మాత్రమే! ఇలాంటి భ్రాంతులను మనము నిర్మూలము గావించుకోవాలి. మనము కేవలము మూఢవిశ్వాసముల చేత కాలమును వ్యర్థము గావించరాదు. నిజమైన సత్యస్వరూపమును తెలుసుకోటానికి ప్రయత్నించాలి. ఇలాంటి సత్యస్వరూపాన్ని తెలుసుకొనే నిమిత్తమై కొన్ని విధములైన విచారణలుకూడను సల్పాలి. యువకులు యిలాంటి పవిత్రమైన కార్యమును దినదినానికి అభివృద్ధిగావించాలి.

**దేహము ఏనాటికి శాశ్వతము కాదు**

క్రీస్తునకు పూర్వము అనేకమంది మహనీయులందరుకూడను, యిలాంటి పవిత్రమైన



srisathyasaivachanamrutam

దివ్యప్రబోధలు సల్పి ప్రజలలోవుండిన యేకత్వాన్ని అభివృద్ధి పరచటానికి కంకణం కట్టుకున్నారు. క్రీపూ 400 సంవత్సరములముందు సోక్రటీసు అనే తత్త్వవేత్త వుండేవాడు. ఈ సోక్రటీస్ ప్రథమశిష్యుడే ఆరిస్టాటిల్. ఈ ఆరిస్టాటిల్ శిష్యుడే అలగ్జాండరు. వారందరు ఆ కాలమునుండికూడను దివ్యమైన ప్రబోధలు సల్పి, పవిత్రమైన దివ్యత్వాన్ని జనులకు అందించే నిమిత్తమై అనేక విధముల పాటుపడుతూ వచ్చారు. సోక్రటీసు యువకులను దగ్గరకు చేర్చుకొని వారిని ప్రేమ విశ్వాసములచేత ఆధ్యాత్మిక తత్త్వాన్ని హృదయానికి హత్తుకునేటట్లు బోధించటానికి ప్రయత్నించాడు. ఆయన చేసే బోధలవల్ల యువకులు పెడమార్గము పట్టవచ్చని చెప్పి ఆనాటి ప్రభువులందరు సోక్రటీసు మార్గము చాలా విపరీతమైన మార్గమని, యువకులను పాడుచేస్తున్నాడని అనేక విధములుగా విమర్శించి, కట్టకడపటికి అతనిని ఒక జైలులో వుంచారు. అయినప్పటికి సోక్రటీసు తాను చేసేది సత్కార్యమని, తాను బోధించేది సత్యమని, దైవత్వమే లేకపోతే జగత్తే లేదని తాను గట్టిగా చాటుతూ వచ్చాడు. ఒకానొక సమయములోపల కొంతమంది అతని అనుచరులంతా చేరి, 'స్వామీ! ఈ జైలునుండి యేదైనా ఒక విధముగా మిమ్మల్ని తప్పించి మీకు హాని కలిగించటానికి ప్రయత్నంచేస్తారు. మీరు ఇక్కడినుండి వేరొక రాజ్యమునకు వెళ్ళిపోండి', అని అనేక విధములుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అప్పుడు సోక్రటీసు ' ఛీ! యీ భౌతికమైన, అల్పమైన జీవితనిమిత్తమై నేను అసత్యమునకు పాటుపడటమా?

**పోకన్మానదు దేహము ఏ విధమునన్ పోషించి రక్షించినన్**
**రాకన్ మానవు హానివృద్ధులు మహారణ్యంబునందాగినన్**

ఎంతకాలము మనము దేహమును పోషించుకున్నప్పటికిని, సర్వసౌకర్యములతో కూడిన వసతులలో వుండినప్పటికి మృత్యుకాలము సమీపించేటప్పటికి నిల్చటానికి వీలుకాదు. నిజముగా నాకు అభివృద్ధియే ప్రాప్తించినట్లైన అడవిలో వుండినా నాకు అభివృద్ధి ప్రాప్తిస్తుంది. కనుక, దేహసంరక్షణ నిమిత్తమై యీ యుక్తులకుగానీ, యీ యోగమునకుగాని, యీ విశిష్టతకుగాని నేను యే మాత్రము పాల్పడను. దైవము యే రీతిగా నిర్ణయిస్తాడో ఆ రీతిగానే నడచుకుంటాన'న్నాడు. ఈ విధంగా సత్యసూక్తులను చక్కగా

తాను అనుసరించి ప్రజలకు బోధించాడు, ఆరిస్టాటిల్. అతని ఆజ్ఞను తూచతప్పక నడచినవాడే అలగ్జాండరు. ఆకాలములో జీససు రాకపూర్వము ఆరిస్టాటిల్‌యొక్క ప్రబోధలు రోములో చాలా అధికముగా జరుగుతూవుండేవి. జీససు వచ్చిన తరువాత కొంతకాలమునకు ప్రజల సేవ నిమిత్తమై తాను అనేక కష్టములకు గురికావటము, తదుపరి ప్రభుత్వముయొక్క మతాధిపతుల ఒత్తిడిచేత తన దేహాన్ని చాలించటము జరిగింది. దేహము యేనాటికి శాశ్వతము కాదు. మన ఆస్తిపాస్తులు అంతకంటే శాశ్వతముకాదు. ధనకనకవస్తువాహనాదులంతాకూడను మనను బంధించునవేగాని, మనకు బాధలు కల్గించేవేగాని, శాంతిని చేకూర్చేవి కాదు. రోమ్‌లో జీసస్ నిరంతరము ధనవంతులైనవారిని విమర్శిస్తూ, వారియొక్క చర్యలను ఖండిస్తూ పేదలకు తగిన సహాయము చేయుటకు అన్నివిధములా పాటుపడినవాడు.

**మనము ఈనాడు కోరవలసినది భగవంతుని ప్రేమధనమును మాత్రమే!**

ఒకనాడు తాను సంచారములో మార్తా, మేరీ అనే యిద్దరు అక్క చెల్లెండ్ర యింటికి భోజనానికి వెళ్లాడు. ఇట్టి మహనీయుడు తమ యింటికి యేతెంచినాడని వారు ఆనందముతో అతనికి అవసరమైన ఆహారాన్ని అందించటానికి శ్రద్ధ వహించారు. మేరీ చెప్పింది. 'యింటికి వచ్చిన అతిథిని వంటరిగా వుంచటం మంచిదికాదు. నీవు అతనితో సంభాషిస్తూవుండు, నేను వంటనంతా సకాలములో పూర్తిచేస్తాన'ంది. ఇంటికి వచ్చినవాడు సామాన్యుడు కాదు! దైవాంశ సంభూతుడు. అతనిని ఆనందపెట్టాలనుకుంటే హృదయపూర్వకమైన సేవలచేతనే అతడు ఆనందించగలడు. అతని దగ్గర బూటకాలు, నాటకాలు పనికిరావు. అందువల్ల హృదయపూర్వకముగా ప్రతి పదార్థముకూడను పరిశుద్ధమైన భావముతో తయారుచేయటంలో కొంతసమయం గడచింది. రాత్రి కావచ్చింది.

ఆ రాత్రి సమయములోపల యెవ్వరికి తెలియకుండా తనయొక్క సమస్యను పరిష్కారము చేసుకోవాలని ఒక ధనవంతుడు జీసస్ దగ్గరకు వచ్చాడు. జీసస్‌యొక్క ప్రబోధలు అతి సూక్ష్మంగా వుంటాయి. ప్రజలందరు చూస్తే యింత ధనవంతునికికూడను

sri sathyasai vachanamrutam

కోరికలున్నవా అని పరిహాసమునకు గురి అవుతానేమోనని అతడు యెవ్వరు చూడకుండా రాత్రి పదిగంటల సమయములోపల మార్తా, మేరీ అనే వారింటికి వచ్చాడు, యీ శ్రీమంతుడు. జీసస్ ప్రశ్నించాడు, 'ఎందుకు నాయనా యిక్కడకు వచ్చావు?' అని. 'స్వామీ! నాకు ధనమున్నది, భవనమున్నది, తగిన అనుకూలములున్నవి. కాని, మనశ్శాంతి లేక అనేక సమస్యలతో నేను బాధపడుతున్నాను. ఈ సమస్యల పరిహారమునకు యేదైనా మార్గము చూపించమ'న్నాడు. జీసస్ నవ్వుతూ ఒక చిన్న మాట చెప్పాడు: 'ఓ ధనవంతుడా! నీ సమస్యల పరిహారమునకు చిన్న మార్గము వుంది. నీవు చేయగలవా', అన్నాడు. 'నీ ఆస్తిపాస్తులను బీదలకు పంచిపెట్టు యిది నీ సమస్యలకు పరిహారమ'న్నాడు. "నీవు యీ ధనము, యీ ఆస్తిపాస్తులు యెంతవరకు పెంచుకుంటావో అంతవరకు నీ సమస్యలు పెరిగిపోతాయేగాని యేమాత్రము పరిహారము కావటానికి వీలులేదు. ధనమును పెంచుకొని యేమి చేయగలవు? ఏనాటికైనా వాటిని విసర్జించి పోకతప్పదు. అలాంటి తుచ్ఛమైన ధనమునకై నీవు జీవితాన్ని అపవిత్రము గావించుకుంటున్నావు. కన్నకుమారుడుగాని, కట్టుకున్నభార్యగానీ ధనము వున్నంతవరకే నీకు గౌరవము, ప్రేమ అందిస్తారు. తదుపరి నిన్ను యెవరూ గౌరవించరు. దైవధనమే నీ నిజ ధనము. ధర్మధనమే నీ నిజధనము. భగవంతుని అనుగ్రహమనే ప్రేమధనాన్ని నీవు పొందు. మనము యీనాడు సంపాదించవలసినది భగవంతుని ప్రేమధనాన్ని మాత్రమే! భౌతికమైన సిరిసంపదలు ఎంత వుండినప్పటికి ప్రయోజనము లేదు" అని బోధించాడు. ఈ విధముగా శ్రీమంతులకు, ధనవంతులకు బోధించి బీదలకంతా సహాయము గావిస్తూవచ్చాడు, జీసస్.

కనుక, జీసస్‌చుట్టూ యెప్పుడూ బీదప్రజలుండేవారేకాని శ్రీమంతులు కాదు. Peter చేపలు పట్టే జాలరి. Mathew, Thomas వీరందరు సామాన్యమైన ప్రజలే! కట్టకడపటికి జీసస్‌యొక్క శక్తిసామర్థ్యములు వెంటనే, జంటనే వుంటుండి గుర్తించినవారు యేదో కొద్దిమంది మాత్రమే! ఇవన్నీ క్రోడీకరించుకొని John అనేవాడు మొట్టమొదట బైబిల్ రాస్తూవచ్చాడు. St. Pal యింకొక బైబిల్ రాస్తూ వచ్చాడు. వీరందరు వినికిడిద్వారా అనేక విషయాలను సేకరించి సంకలనం చేస్తూవచ్చారు. Mathew, tax collector. అతను తాను సేకరించిన అంశములను ఆధారముగా తీసుకొని ఒక బైబిలు రాసాడు. కాని, వీరందరూ

ఒకరు రాసినదానికి యింకొకరు రాసినదానికి యేమీ సంబంధము లేకుండా వుంటున్నాది. కాని, చివరకు అందరూకూడను జీసస్ ప్రపంచమునకు ఒక ఆదర్శమును అందించే వ్యక్తి అని నిరూపించారు. జీసస్ సాక్షాత్తూ భగవంతుడు పంపించిన దైవదూతగా విశ్వసిస్తూవచ్చారు. దానికి తగినట్టుగా జీసస్‌కూడా I am the messenger of God అన్నాడు. ఆ మెసెంజరు యేమి చేశాడు? దైవత్వముయొక్క తత్త్వాన్ని ప్రజలకు చాటుతూవచ్చాడు. కాని, యీనాడు మెసెంజర్సు అని పేరు పెట్టుకొని దైవానికి విరుద్ధముగా ప్రవర్తిస్తున్నారు. St. Pal రోమ్‌లో మొట్టమొదట జీసస్ గురించి ఆయన బోధలను గురించి ప్రచారము సలుపుతూ వచ్చాడు. అయితే, St. Pal మొట్టమొదట జీసస్‌కు పరమవిరోధి. జీసస్ పేరు విన్నా, జీసస్ భక్తులను చూచినా అతను మండిపడేవాడు. ఒకనాడు జీసస్ St. Pal కు స్వప్నములో కనిపించి 'అయ్యా! నన్ను ద్వేషిస్తున్నావా? దైవాన్ని ద్వేషిస్తున్నావా? నేను ఎవరు, దైవమెవరు? ఒకే జ్యోతినుండి వెలువడిన అగ్ని కణములు. నేను, నీవు, సర్వముకూడను దైవస్వరూపమే! కనుక, నిన్ను నీవు దూషించుకుంటున్నావేగానీ నన్నుకాదు', అన్నాడు. ఈ విధముగా స్వప్నములో అతనికి చాలా పరివర్తన కలగటంచేత రెండవదినమునుంచి జీసస్‌పైన విశ్వాసము అభివృద్ధి గావించుకుంటూ వచ్చాడు. తన శేష జీవితమును దైవప్రచారములోపలనే అంకితము గావించాలని ఆనాటినుండికూడను పట్టుపట్టాడు. మొట్టమొదట Romeలో ప్రవేశించి జీసస్‌ను గురించి ప్రచారము సల్పినవాడు, యీ పాల్.

**ఆత్మ ఒక్కటే, ఆరాధనలు వేరువేరుగా ఉండవచ్చును**

ఆనాటి పరిస్థితులలో Rome యేవిధముగా వుండేది? ప్రజలంతా భారతీయ సంస్కృతిలో నిర్దేశింపబడిన సూత్రములవంటి మానవతా విలువలను ఆధారము చేసుకుని జీవించుచుండెడివారు. తల్లితండ్రులను గౌరవించటము, సత్యమును పలకాలి, పెద్దలను గౌరవించాలి, గురువును విశ్వసించాలి, దైవాన్ని ప్రేమించాలి మొదలగు సూత్రములను పాటించేవారు. ఎవరి భావానికి అనుకూలమైన రీతిలోవారు దైవాన్ని ప్రార్థించుకోవచ్చుని వారియొక్క నియమము. ఈనాడు భారతదేశములోనే అనేకమంది "ఏమి?

భారతదేశములోపల యింతమంది దేవుళ్లు, యిన్ని రూపాలు, యిన్ని ఆరాధనలు, యిన్ని మార్గములా?" అని విమర్శిస్తూవుంటారు. దైవము ఒక్కడేగాని వారి వారి అభిప్రాయములను పురస్కరించుకొని, వారి వారి ఆశయములను పురస్కరించుకొని వారికి ప్రీతిపూర్వకమైన మార్గాన్ని అందించే నిమిత్తమై అనేక రూపనామములు ధరిస్తాడని విశ్వసిస్తూవచ్చారు. ఎవరికి నచ్చిన నామ, రూపములను వారు ఆరాధించటానికి వారికి స్వాతంత్ర్యాన్ని యిస్తూ వచ్చింది భారతీయ సంస్కృతి. ఒకరిని ఒకరు బంధించటంలేదు. ఇది యెందుకోసమో భారతదేశం చక్కని జవాబునందించింది. ఒక చిన్న ఉదాహరణము:

ఒక సైజుకు తగిన బుష్కోటును నీకు యిచ్చారు. కానీ యీ బుష్కోటును అందరూ ధరించాలంటే సాధ్యమవుతుందా? ఒకనికి టైట్ కావచ్చును. ఒకనికి లూజ్ కావచ్చును. 'ఎవరి సైజుకు తగినట్లుగా వారు బుష్కోటును కుట్టించుకోవచ్చును' అనుకోటంలో యెంతన్యాయం వుంటున్నాది! కేవలము ఒక్క రూప, నామములనే అందరూ ఆరాధించి అనుభవించాలి అనేది కేవలము నిర్బంధము అవుతుంది. అనేక అనానుకూలములు యేర్పడుతాయి. గుడ్డ ఒకటేగాని, సైజులు వేరు వేరుగా వుండవచ్చు. అదే విధముగా ఆత్మ ఒక్కటే ఆరాధనలు వేరు వేరుగా వుండవచ్చు. అభిరుచులు వేరు వేరుగా వుండవచ్చును. ఇలాంటి సిద్ధాంతమే రోమ్‌లో వుండేది. క్రమక్రమేణా యీ ఏకత్వమనే సిద్ధాంతమును వారు అనుభవిస్తూ, ఆనందిస్తూ ఇతరులకు పంచిపెడుతూ వచ్చారు. ఈ పాల్ ప్రారంభములో అనేక హింసలకు గురయ్యాడు. చెప్పకూడదుకాని, ఒక బోనులో సింహాన్ని పెట్టి, ఆ సింహానికి అతనిని ఆహారముగా అందించారు. అంతగా హింసలు పెడుతూవచ్చారు. కాని, కట్టకడపటికి సత్యాన్ని గుర్తించారు. ఆ సత్యాన్ని గుర్తించిననాటినుండి క్రీస్తుమతమును రోమ్‌లో అభివృద్ధి గావించుతూవచ్చారు.

**ప్రతి మానవుడు పవిత్రమైన దైవాంశస్వరూపమే!**

ఆ సమయంలోనే భగవంతుని అంశము ప్రతీ మానవునియందు వున్నదని గుర్తించి దానినే Persona అని పిలుస్తూవచ్చారు. Persona అనగా పవిత్రమైన దివ్యాంశము అని

sri sathyasaivachanamrutam

అర్థము. దివ్యమైన పవిత్రమైన వ్యక్తిత్వము కలిగిన వారిని Persona అని గౌరవముగా పిల్చేవారు. ఆ Persona నుండియే Person వచ్చింది. ఆ Person నుండి Personality అనేది వచ్చింది. కాబట్టి, Person అంటే యేమిటి? పవిత్రమైన దివ్యత్వముతో కూడినవాడు Person అని అర్థము. ప్రతి మానవుడు పవిత్రమైన దైవాంశస్వరూపమే! అలాంటి దివ్యమైన ఆత్మస్వరూపాన్ని మనము యీనాడు మరచిపోయాము. దానిని తిరిగి మనము జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అందుకొరకు దీనికి కప్పిన మాయను మనము నిర్మూలము గావించుకోవాలి. ఆ కప్పిన మాయ యేమిటి? మన ద్వేషము, అసూయ, స్వార్థము. ఈ మూడింటిని మనము నిర్మూలము గావించుకోవాలంటే ఒక్క ప్రేమ తప్ప అన్యమార్గములేదు. ఆప్రేమచేతనే సర్వ విధములైన ధైర్యము మనకు ప్రాప్తిస్తుంది.

**సత్యమును పాటించడంవల్ల ధైర్యము ఏర్పడుతుంది**

ఒకానొక సమయములో ఒక మఠాధిపతి జీసస్‌ను పిలిపించుకున్నాడు. 'నీవు Jewsకి రాజువా? అని ప్రశ్నించాడు. 'నేను ఆ విధంగా చెప్పటంలేదు' అన్నాడు, జీసస్. 'నీవు అందరికి తప్పుడు మార్గము ప్రబోధము చేస్తున్నావు. యేమంటే నీ ద్వారా ప్రతి ఒక్కడు స్వర్గానికి పోవాలని చెబుతున్నావు. యిది చాలా తప్పు' అన్నాడు, మఠాధిపతి. జీసస్ ఒకే మాట చెప్పాడు: 'Seek the kingdom of Heaven' అన్నాడు. Where is that అన్నాడు. 'Kingdom of Heaven is within You, with in Me, within everybody'. కనుక యీ Kingdom of Heaven మనలోనే వుంటున్నది. అలాంటి ప్రబోధ చేసే నేను నా ద్వారానే Kingdom of Heaven అని చెప్పటం అసంభవమైన విషయమ'న్నాడు. ఈ ధైర్యము యే విధముగా వచ్చింది? సత్యమువల్లనే ధైర్యము యేర్పడుతుంది. సత్యము యెక్కడనుండి వస్తుంది? శాంతమువల్లనే వస్తుంది. శాంతము యెక్కడనుండి వస్తుంది? ప్రేమతోనే సంభవిస్తుంది. ఈ ప్రేమ యెక్కడనుండి వస్తుంది? నమ్మకంవల్లనే వస్తుంది. కనుకనే

**Where there is confidence, there is love**
**Where there is love, there is peace**
**Where there is peace, there is bliss**
**Where there is bliss, there is GOD**

srisathyasaivachanamrutam

ఈ విధమైన మార్గమునందు దైవత్వమును మనము పొందాలంటే విశ్వాసము అభివృద్ధికావాలి.

**హృదయమే ఈశ్వరుడు, మనసే విష్ణువు, అహంకారమే బ్రహ్మ**

దైవమును భారతదేశమునందు 'బ్రహ్మ', 'విష్ణు', 'మహేశ్వర' స్వరూపములని విశ్వసిస్తున్నారు. ఈ ముగ్గురు మూడు ఆకారాలు ధరించి సినిమా actors మాదిరి దర్శనమివ్వటానికి లేరు. నిజానికి ఈ రూపాలు చూచిన వారు యెవ్వరూ లేరు, యీ జగత్తులో. ఇవి ఒక విధమైన విశ్వాసము అభివృద్ధిపరచే నిమిత్తము యేర్పడినటువంటివే! ఇవి కేవలము ఒక భ్రాంతియే! అయితే, యీ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రతి ఒక్కరి హృదయమునందు వుంటున్నారు. హృదయేశుడే ఈశుడన్నారు. అనగా హృదయమే ఈశ్వరత్వము. హృదయమే ఆత్మతత్త్వము. హృదయమే దివ్యత్వము. హృదయమే ప్రేమతత్త్వము. Not physical heart, spiritual heart. ఈ spirtual heart అపరిమితమైనది. అదియే ప్రేమతత్త్వము. ఆ ప్రేమకు హద్దే లేదు. నీ సంకుచితమైన భావాలతో నీవు దానికి హద్దు నిర్మించుకుంటున్నావుగాని నిజముగా దానికి హద్దులు లేవు. ఆ హృదయమునుండి ఆవిర్భవించినదే మనసు. మనసు యెక్కడ వుంటున్నది? సర్వత్రా వుంటున్నది. 'మనోమూలమిదం జగత్'. జగత్తంతా వ్యాపించినది మనస్సే. ఈ మైండ్‌ని విష్ణువు అన్నారు. విష్ణువు అనగా సర్వవ్యాపకుడు సర్వాంతర్యామి. హృదయమునుండి పుట్టినది మనసు. అనగా ఈశ్వరత్వమునుండి వచ్చినది విష్ణుత్వము. మనసునుండి ఆవిర్భవించినవాడే బ్రహ్మ. అతనే అహం. కనుక యీ అహంనుండియే అన్నీ ఆవిర్భవిస్తాయి. బ్రహ్మ విష్ణువు నాభినుండి పుట్టినవాడని అంటున్నాము. అనగా మనసుయొక్క చంచలస్థానమునుండి వచ్చినదే యీ అహము. ఏతావాతా హృదయమే ఈశ్వరుడు, మనసే విష్ణువు, మనయొక్క అహంకారమే బ్రహ్మ. సశివ, సబ్రహ్మ, సవిష్ణు. ఇదియే వశిష్ట రామాయణముకూడను చెప్పుతూ వచ్చింది. కాన, ప్రతి ఒక్కటికూడను మన హృదయమునందే వుంటున్నవి.

**మనస్సును పరిశుద్ధము చేసుకుంటే అంతకు మించిన సాధన లేదు**



srisathyasaivachanamrutam

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనేవారు ప్రత్యేకమైనవారుకాదు. మన హృదయమే ఈశ్వరునిగా, మన మనసే విష్ణువుగా, మనయొక్క అహమునే బ్రహ్మగా తలచుకొనిన మనము యే తప్పులు, యే పొరపాట్లుకూడను చేయటానికి అవకాశమువుండదు. మనసు చాలా పవిత్రమైనది. కనుకనే 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని చెప్పబడింది. మోక్షమునకుకూడను అర్హతగలిగినది యీ మనసు. ఈ మనసును ఆవరించిన మాలిన్యమును కప్పి పుచ్చుటముచేత యిది పెడమార్గము పట్టుతున్నది. మనసును పరిశుద్ధము చేసుకుంటే యింతకు మించిన సాధన మరొకటిలేదు. ముందొకటి వెనుక ఒకటి, మనము మనసున భావించరాదు. తమ పెద్ద దోషములైనా తాను కప్పిపుచ్చుకోటం, పరుల చిన్న దోషమైనా గొప్పదిగా భావించుకోటం యీ విధమైన దుర్గుణములచేత మనసు మాలిన్యముతో నిండిపోతోంది. కనుక, మనసును పరిశుద్ధము చేసుకునే మార్గములే యీ సాధనలన్నీ! ఈ మనసును యేనాడు మనము పరిశుద్ధము గావించుకొందుమో ఆనాడే మనకు మనమే దైవస్వరూపాన్ని అనుభవించగలము. దైవము మనకంటే వేరుగాలేదు. దైవము నీలో లేదు. నీకు వెలుపల లేదు. నీవే దైవము. ఇలాంటి విశ్వాసమును మనము అభివృద్ధిగావించుకుంటూరావాలి.

**కాలము ఎవరికొరకు ఆగేదికాదు, నీవే కాలాన్ని అనుసరించాలి**

మొట్టమొదట 'అహంపండితాః' అనగా నేనుకూడను పండితుడనే అన్నాడు. పూర్తి విచారణ చేసుకున్న తరువాత 'అహంనపండితాః' నేను పండితుడనుకాను అన్నాడు. నేను కేవలము మానవుడని భావిస్తున్నావు. కొంతకాలము పోయిన తరువాత నేనుకూడను దివ్యత్వాన్ని కావచ్చును అనుకొని అనుభవిస్తున్నావు. చివరకు నేను దివ్యత్వమే అనే నిశ్చలమైన స్థితికి వస్తున్నాము. ఇదే జీసస్ చెప్పిన ప్రధానమైన మార్గము. మొట్టమొదట I am the messenger of God అన్నాడు. క్రమక్రమేణా I am son of God అన్నాడు. తదుపరి I and my father are one అన్నాడు. ఈ విధమైన సోపానములు దాటి దివ్యత్వములో తాను ఐక్యతను పొందాడు. కనుక కాలసర్పము కాటువేయకపూర్వమే, జీవిత నావ మునగక పూర్వమే, యీ పడవకు చిల్లులు పడి శిధిలముకాక పూర్వమే మనము ఆ



srisathyasaivahini.org

దివ్యత్వాన్ని పొందటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. మనము కాలమును వ్యర్థము చేయరాదు. కాలము యెవరికొరకు ఆగేదికాదు. కాలము నిన్ను అనుసరించేదికాదు. నీవే కాలాన్ని అనుసరించాలి. కాలమునకు అతీతమైనవాడు దైవము. అట్టి దైవత్వాన్ని మనము శరణుజొచ్చినప్పుడే దివ్యత్వమనే ఆత్మతత్త్వమును అర్థము చేసుకోగలము. కాని యీనాటి మనయొక్క అర్పితములు, యీనాటి మన పూజలు, యీనాటి మన ప్రార్థనలు యుక్తులతో భగవంతునికూడను మోసపరచే మార్గములో ఉన్నవి. ఈ ఆడంబరములకుగాని, అహంకారములకుగాని భగవంతుడు చిక్కడు. అహంకారము వుండినంతవరకు ఆత్మతత్త్వాన్ని నీవు గుర్తించలేవు. ఏనాడు అహంకారము నిర్మూలము గావింతువో ఆనాడే నీకు ఆత్మదర్శనమవుతుంది. అహంకారము దట్టమైన తెరవంటిది. ఆ తెరను పూర్తిగా నిర్మూలము గావించునంతవరకు నీకు ఆత్మానందము లభించదు.

## దైవమును నమ్మినవాడే నిర్భయుడు

ప్రేమస్వరూపులారా! అహంకారము నిర్మూలము గావించుకోండి. ఎవరిగురించి అహంకారముతో వున్నావు? నీ అహంకారము యెంతమాత్రము? ఇంత విశ్వాన్ని చూచి నీవు అహంకారపడటము యెంత అజ్ఞానము? దేనిలో నీవు బలవంతుడవు? శరీరములోనా లేక గుణములోనా? పనిలో బలవంతుడా, ధనములో బలవంతుడా, విద్యలో బలవంతుడా? దేనియందు బలవంతుడు తాను? నిజానికి, దైవబలములేని బలవంతుడు, బలవంతుడా? కానే కాదు. నిశ్చయంగా దుర్బలుడు. కనుక, మనము యేమి చేసినప్పటికి అంతా దైవబలముగానే భావించుకోటం సరైన మార్గము. అందులోనే మనకు శాంతి చేకూరుతుంది. ధనములో మనకు శాంతి లేదు. చదువుతో మనకు శాంతిలేదు. అధికారముతో శాంతిలేదు. ఇవన్నీ మనల్ని మరింత బంధనలలో తోసేవేగాని, నిర్భయుని గావించేవి కాదు. దైవమును నమ్మినవాడే నిర్భయుడు; అతనే అభయుడు. దైవమును విశ్వసించనివారంతా దుర్బలురే! వారు పడుతున్న అవస్థలు మనము చూస్తూనే వున్నాము. కనుక, దైవ విశ్వాసాన్ని మనము పెంచుకొని దైవత్వాన్ని చింతించి దివ్యత్వముతో జీవితాన్ని గడపాలి. చదువు సంధ్యలుకూడ వుంచుకోవచ్చు. కాని, నిజంగా మనము చేసే పొరపాటు

sri sathyasai vachanamrutam

యేమిటి? దైవాన్ని వెతికే బుద్ధితో మనము ధనాన్ని అనుసరిస్తున్నాము. ఆత్మను వెతకవలసిన బుద్ధితో మనము అన్నాన్ని వెతుకుతున్నాము. ఆత్మవుంటే సర్వము వుంటున్నాది. ఆత్మాన్వేషణ చేయకుండా అన్నాన్వేషణ చేయటం కేవలము అజ్ఞానమే కదా! నీ ముఖమును చూచుకోమని నీకొక అద్దము యిస్తే ఆ అద్దమును తీసుకొని వెళ్ళి యింకొకరి ముఖము ముందర పెడితే నీ ముఖము యెట్లా కనపడుతుంది! యీ అద్దాన్ని యితరులకంతా అన్వయింపచేస్తున్నావేకాని నీకు నువ్వు చూసుకోటానికి ప్రయత్నం చేయటంలేదు. తన దోషాన్ని తాను వెతుక్కొన్నటువంటివాడే ధన్యుడు. తన తప్పును తాను చూసుకున్నవాడు ధన్యుడు. పరులయందు మంచిని చూచే వాడు ధన్యుడు. పరులయందు చెడ్డను చూడటం, తనయందు చెడ్డవుండినప్పటికి మరుగు చేసుకోటం, యిది మానవునియొక్క లక్షణము కాదు. అందరియందు నీవు మంచినిచూడు. ఎవరిని దూషించవద్దు. 'సర్వభూత తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి'. ఎవరిని దూషించినా నీవు దైవాన్ని దూషించినవాడవౌతావు. అందరితోను ప్రేమతో వుండి సాధించు.

**దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి–ఈ మూడింటివల్లనే త్రికరణశుద్ధి ఏర్పడుతుంది**

మానవజీవితము చాలా పవిత్రమైనది. ఇలాంటి జీవితాన్ని మనము వ్యర్థము గావించకూడదు. ఎన్నో దేశములనుండి యిక్కడకు చేరినారు. వారి వారి దేశాలలో ఏమి తక్కువై యిక్కడకు చేరినారు. ధనమునకు తక్కువలేదు, అనుకూలాలకు తక్కువలేదు, ఆనందానికి తక్కువలేదు. అయితే, ఇవన్నీ భౌతికమైనవే! కాని, ఆనందమనేది ఆత్మరూపమైనది. అది వారికి యెక్కడా లభించలేదు. ఒక్క ఆత్మయందుమాత్రమే యీ ఆనందము మనకు లభ్యమౌతుంది. కనుక మన దృష్టినంతను ఆత్మవైపుకు మరల్చాలి. ఆత్మ అంటే యేమిటి? విశాలత్వమే మన ఆత్మతత్త్వము. నేను, నా వారు అనే సంకుచిత భావాన్ని నిర్మూలంచెయ్యాలి. 'అందరూ నావారే, అందరూ దైవబిడ్డలే, అందరకు తండ్రి ఒక్కడే!' అని భావించాలి. 'బిడ్డలనేకము, కాపాడే ప్రభువు ఒక్కడే' అనే సత్యాన్ని గుర్తించాలి. ఒక్క ప్రేమయే సరైన మార్గము. సేవలే సరైన మార్గము. మన సింగ్ చెప్పాడు. Love of God, fear of sin and morality in society అని. యీ మూడే మనకు ముఖ్యము.

దైవమును మనము ప్రేమించితిమా యింక పాపముయొక్క భయము యేర్పడుతుంది. దైవప్రేమలేని వానికే పాపమునందు యేమాత్రము భీతి వుండదు. దైవప్రీతి కలిగినవాడు మానవుడు. ఆ ప్రీతి కోల్పోతే వాడు దానవుడౌతాడు. దానినుంచి భయమనేదే వుండదు. వాడు చేసేదంతా పాపములే! పాపము చేయటమువలన సమాజములో యెట్లు గౌరవింపబడతాడు? కనుక, పాపభీతి కలగాలంటే దైవప్రీతి మనము సంపాదించుకోవాలి. దైవప్రీతితో మనకు పాపభీతి అభివృద్ధి అవుతుంది. పాపభీతివల్ల సమాజములో గౌరవాన్ని పొందుతాము. ఎట్టి తప్పులు చేయడు. యీ మూడింటియొక్క స్వరూపమే ముమ్మూర్తి స్వరూపము. ఇలాంటి ముమ్మూర్తి స్వరూపమే త్రికరణశుద్ధి అన్నారు.

## ప్రేమలేకపోతే జీవితమే లేదు

త్రికరణశుద్ధితో చేసే పూజలవల్ల మనము మానవత్వముతో దివ్యత్వమును పొందవచ్చు. కనుక, మనము ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. ఈ ప్రేమకంటే మించినది మరొకటిలేదు. ఏ దేశమువారైనా, ఏ తెగవారైనా, ఏమతమువారైనా, ఏయొక్క సాంప్రదాయమువారైనా అందరికి ప్రేమ ఒక్కటే! ఏమతమువారుకూడను ప్రేమను ధిక్కరించమని చెప్పరు. ఏ దేశము వారైనను ప్రేమను ఉల్లఘించమని చెప్పరు. ఏ తెగవారుకూడను ప్రేమను తిరస్కరించమని చెప్పరు. ప్రేమలేకపోతే జీవితమేలేదు. కాబట్టి యీ ప్రేమచేతనే మీరందరు యిక్కడకు చేరగలిగారు. కనుక యీ ప్రేమను మనము బలపరచుకోవాలి. ఈ ప్రేమయే మీకు దైవము. Love is GOD, live in love. కనుక మీరు ప్రేమలో దైవత్వాన్ని యేనామము మీ కిష్టమో, యే రూపము మీ కిష్టమో, యే మార్గము మీ కిష్టమో దానిని అనుసరిస్తూ పోవటములో తప్పులేదు. మన హృదయానికి నచ్చినదే మనకు ప్రీతి. కనుక మీరు హృదయాన్ని అనుసరించుకుంటూ హృదయప్రేమను అందుకుంటూ, ఆ హృదయప్రేమలోనే లగ్నముకండి!

**(తేదీ 25-12-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam